నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 8 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జిల్లా న్యాయమూర్తికి అయోధ్య అక్షింతలు

జిల్లా న్యాయమూర్తికి అక్షింతలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆసిఫాబాద్, జనవరి7 : ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న అక్షింతల పంపిణీ భక్తిశ్రద్ధలతో కొనసాగుతుంది. ఆదివారం ఆసిఫాబాద్‌లో జిల్లా న్యాయమూర్తి ఎంవీ రమేశ్ దంపతులకు ట్రస్ట్ సభ్యులు రాములోరి అ క్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడు తూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, తద్వారా నేరపూరితమైన ఆలోచనలు కూడా రావని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ఆంజనేయులు, సతీష్‌బాబు, శ్రీనివాస్, విశాల్, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, వేణు, మధూకర్, భక్తులు రమేశ్, చంద్రశేఖర్‌గౌడ్, రాంచందర్, బల్‌రాం పాల్గొన్నారు.

జడ్జి ముఖేష్‌కు రాములోరి అక్షింతలు అందజేత

అక్షింతలు అందుకుంటున్న జడ్జి ముఖేష్

బెల్లంపల్లి, జనవరి 7 : బెల్లంపల్లి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జే.ముఖేష్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, శ్రీ కోదండ రామాలయం పూజారులు ఆదివారం రాములోరి అక్షింతలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో హిందూ కుటుంబ సభ్యులకు అక్షింతలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోదండ రామాలయం పూజారి, సభ్యులు మురళి, వేణు,శ్రీనివాస్, శేషుకుమార్ పాల్గొన్నారు.

టూల్ బాక్స్‌లను పరిశీలిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఆర్కే-5గనిపై దొంగతనం

- రూ.10 వేలు, సెల్‌ఫోన్లు చోరీ
- పోలీసులకు ఫిర్యాదు
- యాజమాన్యమే బాధ్యత వహించాలన్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 7 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5గనిపై కార్మికుల రెస్ట్‌హాల్‌లో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. టూల్ బాక్స్‌ను పగుల గొట్టి అందులోని రూ. 10 వేలతో పాటు దుస్తులు, బ్యాగులు, రూ. 1.60 లక్షల విలువైన సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు శ్రీరాంపూర్ ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పిట్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నర్సింహారావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి దొంగతనం జరిగిన రెస్ట్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం లాకర్స్ రూం ఏర్పాటు చేయకపోవడం వల్లే తరచూ దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఘటనకు యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గనిపై సరైన రక్షణ లేకపోవడం వల్లే దొంగతనం జరిగిందన్నారు. కార్మికుల టూల్ రూంకు ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు నీలం సదయ్య, సమ్మయ్య, మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, జనవరి 7: మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని పొల్లుగూడ గ్రామంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని జుగ్నాక్ వంశీయుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే నెల పుష్యమాసం కావడంతో కులదేవతలతో పాటు పెర్సపేన్, సతీక్ దేవుళ్లకు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. కొత్తగా నిర్మించిన సతీక్ దేవత ఆలయ ప్రారంభోత్సవం మే నెలలో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి కుటుంబం నుంచి రూ. 3 వేలు విరాళంగా అందించాలని సమావేశంలో తీర్మానించారు. కటోడ జుగ్నాక్ మహదు, గ్రామపటేల్ కోరెంగా పొల్లు, ఇంద్రవెల్లి జీపీ మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్ రావ్, జుగ్నాక్ వంశీయుల పెద్ద దేవుడు కమిటీ అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, ప్రధాన కార్యదర్శి జుగ్నాక్ జాలిమ్, గ్రామస్తులు శంకర్, కాశీరాం, జ్యోతిరాం, లింగు, సంబన్న తదితరులు పాల్గొన్నారు.

1.17 లక్షల మెట్రిక్ టన్నులు

ఇప్పటి వరకు జిల్లాలో కొన్న వడ్లు

- రైతుల అకౌంట్లో రూ.98.65 కోట్లు జమ
- మిగతా వారికి త్వరలోనే చెల్లింపులు
- ఆఖరు గింజ వరకూ కొంటాం : సివిల్ సప్లయ్ డీఎం గోపాల్

> మంచిర్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్నది. వానకాలంలో 1,57,443 ఎకరాల్లో వరి సాగు చేయగా, యంత్రాంగం ఇప్పటి వరకు 1.17 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించింది. ఇప్పటికే 6,281 మంది రైతులకు రూ. 98.53 కోట్లు జమ చేయగా, మిగతా వారికి త్వరలోనే చెల్లించే అవకాశమున్నది.

ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

మంచిర్యాల అర్బన్, జనవరి 7 : జిల్లాలోని 270 కేంద్రాల్లో డీఆర్‌డీఏ(ఐకేపీ), పీఏసీఎస్, డీసీఎంఎస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. కలెక్టర్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ప్రత్యేకాధికారులను నియమించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వడ్ల సేకరణ చేపడుతున్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా, లారీల సమస్య రాకుండా మూడు సెక్టార్‌ల ట్రాన్స్‌పోర్టర్లతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో వానకాలంలో 1,57,443 ఎకరాల్లో వరి సాగు చేశారు. కేసీఆర్ సర్కారు 24 గంటలు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయడంతో రంది లేకుండా పంటలు వేసి మంచి దిగుబడులు సాధించారు. ఇప్పటి వరకు జిల్లాలో 17,833 మంది రైతుల వద్ద 1,17,162.12 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 54 డీఆర్‌డీఏ ఐకేపీ కేంద్రాల ద్వారా 21,634.68 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ 129 కేంద్రాల ద్వారా 42,578.40 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ 90 కొనుగోలు కేంద్రాల ద్వారా 52,949.04 మెట్రిక్ టన్నులు, ఇలా మొత్తం 1,17,162.12 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు 6,281 మంది రైతుల ఖాతాల్లో రూ. 98.53 కోట్లు జమ చేశారు.

రూ. 143 మద్దతు ధర పెంచి..

గతంలో క్వింటాల్ వరి ధాన్యం 'ఏ' గ్రేడ్‌కు రూ. 2060, సాధారణ రకానికి రూ. 2040 చెల్లించగా, వానకాలం వడ్లకు రూ. 143 మద్దతు ధర పెంచారు. ప్రస్తుతం క్వింటాల్ 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 అందిస్తున్నారు. అది కూడా ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ఆన్‌లైన్‌లో నేరుగా రైతు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరి ధాన్యం

ఆఖరు గింజ వరకూ కొంటాం

వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా గన్నీ బ్యాగులు, వాహనాలు అందుబాటులో ఉంచాం. ఏదైనా సమస్య మా దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తున్నాం. ఆఖరు గింజ వరకూ కొనుగోళ్లు జరుపుతాం. - గెడం గోపాల్, డీఎం, పౌరసరఫరాల సంస్థ, మంచిర్యాల

ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న టీయూటీఎఫ్ నాయకులు

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి7 : ఉపాధ్యాయులంతా విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. ఆదివారం తన నివాసంలో టీయూటీఎఫ్ సంఘం-2024 క్యాటెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. సిర్పూర్(యు), లింగాపూర్, జైనూర్ మండలాలకు సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతభత్యాలు, ఇతర బిల్లుల మంజూరులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జైనూర్ కేంద్రంగా ట్రెజరీ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్ కోరారు. అనంతరం కోవ లక్ష్మిని నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు గెడం జనార్దన్, ఆర్థిక కార్యదర్శి వెంకట్రావ్, నాయకులు ప్రకాష్, శ్రీనివాస్, రవీందర్, రవి, మధు, ధన్‌రాజ్, ఉపాధ్యాయులు కేశవ్, శంకర్‌రావు, విద్యాసాగర్, నాగేశ్, రామకృష్ణ, రమేశ్, సుభాష్, ప్రవీణ్, మహేశ్వరరావ్, హన్మంత్‌రావు, సత్యనారాయణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి

విద్యార్థి రిషాంక్

హాజీపూర్, జనవరి 7 : గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిషాంక్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షేరు శ్రీధర్ తెలిపారు. ఇటీవల నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో రిషాంక్ ప్రతిభకనబరిచాడని, ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జనగామాలో జరిగే ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మంచిర్యాల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ఈ మేరకు రిషాంక్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టె దేవేందర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహాయ ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, డిప్యూటీ వార్డెన్ సందీప్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌కు అన్నారం విద్యార్థి

- మేలో జరిగే సకురా సైన్స్ హైస్కూల్ ప్రోగామ్‌కు వెళ్లనున్న మణిప్రసాద్
- ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో అత్యుత్తమ ప్రతిభ
- కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ చేతుల మీదుగా జాతీయ అవార్డు
- అధికారులు, ఉపాధ్యాయుల అభినందనలు

ప్రాజెక్టు వద్ద గైడ్ సురేందర్, మణిప్రసాద్ (ఫైల్)

విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, జనవరి 7 : కోటపల్లి మండలం అన్నారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి జుమ్మిడి మణిప్రసాద్ (గతేడాది పదో తరగతి-ప్రస్తుతం ఇంటర్) గతేడాది అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబరిచాడు. కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్ చేతుల మీదుగా జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నాడు. ఈ యేడాది మేలో జపాన్‌లో నిర్వహించే సకురా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రామ్‌కు మణిప్రసాద్‌కు ఆహ్వానం అందగా, ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మణిప్రసాద్‌ను హెచ్ఎం రమేశ్, డీఈవో కార్యాలయ సెక్టోరల్ అధికారి చౌదరి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మణిప్రసాద్ రూపొందించిన ప్రాజెక్టు

గ్రెయిన్ ప్రొటెక్టర్ ఫ్రం రెయిన్ అండ్ యానిమల్స్(వర్షం, పశువుల నుంచి పంటలు రక్షించుకోవడం)

గైడ్ టీచర్ పేరు : ఎస్ సురేందర్, ఎస్ఏ భౌతిక రసాయన శాస్త్రం.

ఉపోద్ఘాతం : రైతులు తాము పండించిన ధాన్యాన్ని మొదట ఆరబెడుతారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం రాకపోతే కేంద్రాల్లోనే ఉంచాల్సి వస్తుంది. వర్షం వస్తే ధాన్యాన్ని వెంటనే తడువకుండా తరలించడం, ఎత్తడం కష్టమవుతుంది. తడిస్తే గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోవాల్సి వస్తది. అలాగే ఆరబోసిన ధాన్యం చుట్టూ కంచె లేకుంటే పశువుల పాలవుతుంది. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు ఈ 'గ్రెయిన్ ప్రొటెక్టర్ ఫ్రం రెయిన్ అండ్ యానిమల్స్' ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.

పని చేసే సూత్రం : ద్రవాల విద్యుత్ వాహకతపై (తడి సెన్సార్ పై) ఆధారపడి పనిచేస్తుంది.

కావాల్సిన పరికరాలు : కర్రలు (గుంజలు), ప్లాస్టిక్ పైపులు, కవర్లు, రైన్ సెన్సార్, మోటర్ ప్రోగ్రామింగ్ మైక్రో కంట్రోలర్, సోలార్ ప్లేట్, 12వీ బ్యాటరీ. ఇనుప తీగ, బజార్ 1.5వీ బ్యాటరీలు.

పని చేసే విధానం : ధాన్యం (వడ్లు, కందులు, పెసలు, మొక్కజొన్న, జొన్న తదితర) ఆరబోసే ప్రాంతంలో రెండు వైపులా ఏటవాలుగా ఉండేటట్లు కర్రలు(గుంజలు), ప్లాస్టిక్ పైపులతో పందిరి (గుడిసె)లా ఏర్పాటు చేయాలి. దీని లోపల నేల కొంచెం ఎత్తుగా నిర్మించాలి. దానిపై కవర్ వేసి ధాన్యం ఆరబోయాలి. దీని పై భాగంలో ఒక మైక్రో కంట్రోలర్‌కి కలుపబడిన రైన్ సెన్సార్ అమర్చాలి. కవర్స్ రూలర్‌కి చుట్టి, ఈ రూలర్స్ మైక్రో కంట్రోలర్‌కు కలుపబడిన మోటర్‌కి జత చేయాలి. ఇప్పుడు చినుకులు రైన్ సెన్సార్‌పై పడగానే మైక్రో కంట్రోల్‌కి సమాచారం ఇస్తుంది. మైక్రో కంట్రోలర్ మోటర్‌కి సమాచారం చేరవేస్తుంది. అప్పుడు మోటర్ రొటేట్ అవుతూ కిందికి వచ్చి ధాన్యంపై కవర్ కప్పబడుతుంది. దీంతో ధాన్యం తడువదు. అలాగే కింద నేల ఎత్తుగా ఉండి కవర్లో ధాన్యాన్ని ఆరబోయడం వల్ల నేలపై పడ్డ నీరు ధాన్యంలోకి రాదు. ఈ విధంగా రైతు తన ఆరబోసిన ధాన్యాన్ని వర్షం, జంతువుల నుంచి రక్షించుకోవచ్చు. దీనిని రైతులు అతి తక్కువ ఖర్చులో పంట పొలాల్లో గాని, ఇంటి వద్ద గాని ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది 12వీ బ్యాటరీతో పని చేస్తుంది. సోలార్ ప్లేట్లు ఉపయోగించి కరెంటు బ్యాటరీలో నిలువ చేసుకొని వాడవచ్చు. దీనిని ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు రైస్‌మిల్లుల్లోనూ ఏర్పాటు చేసుకోవచ్చు.

జిల్లా విద్యార్థికి అవకాశం రావడం ఆనందంగా ఉంది

2024, మేలో జపాన్‌లో నిర్వహించే సకురా ప్రోగ్రామ్‌లో మణిప్రసాద్ పాల్గొంటాడు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు విద్యార్థులకు ఈ అవకాశం వచ్చింది. అందులో మన జిల్లా విద్యార్థి ఉండడం అభినందనీయం. సకురా ప్రోగ్రామ్ ద్వారా సాంకేతికతను దగ్గర నుంచి తెలుసుకొని మరిన్ని ఆవిష్కరణలు రూపొందించేందుకు దోహదపడుతుంది.

- యాదయ్య, మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి అభివృద్ధికి తోడ్పాటునందించాలి

నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి, జనవరి 7 : యువత రాజకీయాలకతీతంగా బెల్లంపల్లి అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఏసీపీ సదయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని ఏఎంసీ గ్రౌండ్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ముందుగా టాస్ వేసి బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అడ్వకేట్స్ టీమ్, మున్సిపల్ కార్యాలయ టీమ్‌ల మధ్య పోటీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై మక్కువ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ పులాల రవికుమార్, ఎస్‌హెచ్‌వోలు రమేష్, బన్సీలాల్, ఎస్ఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు మల్లారపు చిన్నరాజం, ఈసా, ఆదర్శవర్ధన్ రాజు, సిరంగి శంకర్, కొమ్ము రాజన్న, బండి లక్ష్మణ్, జాడి మహేశ్, దుర్గం గోపాల్, మల్లాగౌడ్, తారా చంద్, నర్సయ్య, బామండ్లపల్లి స్వామి, బాలు యాదవ్, శ్రీనివాస్, మూర్తి, ఎనగందుల వెంకటేశ్, భామండ్లపల్లి భరత్, మైదం అనిల్, నవీన్, అభిలాష్, వెంకటస్వామి, విజయ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ముఖేశ్‌గౌడ్

36వ వార్డులో ముగ్గుల పోటీలు

మంచిర్యాలటౌన్, జనవరి 7 : జిల్లా కేంద్రంలోని 36వ వార్డు(ఇందిరానగర్)లో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి నేపథ్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ముఖేశ్‌గౌడ్ బహుమతులు అందించారు. పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందించారు. అనంతరం భోగిమంటలు వేసి సంక్రాంతి పండుగను ఆహ్వానించారు.

సన్నరకం..బహు ప్రియం..

- గతేడాదికంటే పెరిగిన వడ్ల ధరలు
- ఈ సీజన్‌లో క్వింటాలుకు రూ. 3 వేలకు పైగా..
- నేరుగా వచ్చి కాంటాలు పెడుతున్న వ్యాపారులు
- తేమ శాతం తగ్గకముందే కొనుగోళ్లు
- రైతన్నలకు సిరులు.. సర్వత్రా హర్షం

సన్నరకం వరిని కోస్తున్న హార్వెస్టర్

దండేపల్లి, జనవరి7 : జిల్లాలో ఈసారి సన్న వడ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. సన్న రకాల్లో 101, చిట్టి పొట్టి రకాలను సాగు చేశారు. గతంలో వానకాలంలో 40 నుంచి 50 శాతం, యాసంగిలో 80 నుంచి 90 శాతం మేర దొడ్డు రకం వడ్లు సాగు చేసేవారు. వీటిని ప్రభుత్వమే కొనుగోలు చేసేది. గతంలో సన్న రకం వడ్ల సాగు అంతంత మాత్రమే ఉండేది. వ్యాపారులు చెప్పిన ధరకే రైతులు అమ్ముకోవాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో పెట్టుబడి కూడా వచ్చేది కాదు. కానీ ఈసారి రైతన్నలకు సన్నాలు సిరులు కురిపిస్తున్నాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ ప్రభావంతో ఈసారి సన్నాల దిగుబడి తగ్గింది. దీంతో ఒక్కసారిగా ధర ఆకాశాన్నంటింది. స్థానిక వ్యాపారులే కాకుండా బడా మిల్లర్లు నేరుగా వచ్చి ధాన్యం కొనుగోలు చేయడంతో రైతుల పంట పండుతుంది. గత వానకాలం సీజన్‌లో సన్నాలకు ప్రారంభంలో క్వింటాలుకు రూ.2 వేల వరకు ఉండగా, చివరి వరకు రూ.2300 నుంచి రూ.2500 వరకు ధర పలికింది. కానీ ఈ సీజన్ ప్రారంభంలోనే క్వింటాలుకు రూ.2800 ఉండగా, ప్రస్తుతం రూ.3 వేలకు పైగా పలుకుతోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి ధర పెంచి కొనుగోలు చేస్తుండగా, అన్నదాతల్లో ఆనందం కనిపిస్తున్నది.

వరి సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాగు	సన్నరకం (సుమారుగా)
మంచిర్యాల	1.57,000	94,200
నిర్మల్	1,35,000	81,000
ఆసిఫాబాద్	56,000	33,600
ఆదిలాబాద్	2,000	1,200

తేమ శాతం తగ్గకముందే...

సాధారణంగా వరికోత పూర్తి కాగానే వడ్లను కొన్ని రోజుల పాటు ఆరబెడుతారు. తేమ శాతం తగ్గిన తర్వాత విక్రయిస్తారు. కానీ.. ఈసారి వడ్లు ఆరకముందే ప్రైవేటు వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి తూకం వేస్తున్నారు.

మంచి ధర వచ్చింది

సన్న రకాలకు ఎన్నడూ లేని విధంగా ఈసారి మంచి ధర వచ్చింది. పంట కోయడమే ఆలస్యం వ్యాపారులు కల్లం వద్దకే వచ్చి కాంటా పెట్టిస్రు. పోయినసారి కంటే ఈసారి రూ. 1000 దాకా ఎక్కువ పెట్టి కొన్నరు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. - గోళ్ల మల్లేశ్, రైతు, తాళ్లపేట.